నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, గురువారం 17 ఏప్రిల్ 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY




దేవరుప్పుల : సీతారాంపురం వద్ద వాల్ రైటింగ్ చేస్తున్న ఎర్రబెల్లి



రజతోత్సవ సభ ఏర్పాట్లను చూస్తున్న మాజీ మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి, ఎమ్మెల్సీ పోచంపల్లి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది, నన్నపునేని, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలమల్లు, కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవారెడ్డి

# కేసీఆర్ వల్లే తెలంగాణ నంబర్ వన్

- బీఆర్ఎస్‌పై ప్రజల్లో ఎనలేని విశ్వాసం
- సభకు పండుగలా తరలిరావాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి, ఏప్రిల్ 16 : తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దిన ఘనత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఊరూరా ఉద్యమస్ఫూర్తితో కథనాయకులై కదలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం పాలకుర్తిలో బీఆర్ఎస్ మండల విస్తృత స్థాయి సమావేశాన్ని మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ రజతోత్సవ సభను పండుగ వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ఊరూరా పార్టీ జెండాను ఆవిష్కరించి సభకు రావాలని కోరారు. కాంగ్రెస్, సీఎం రేవంత్‌రెడ్డివి బ్రోకర్ మాటలని మండిపడ్డారు. అబద్ధాలతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి త్వరలోనే గద్దె దిగక తప్పదన్నారు. రాష్ట్ర ప్రజలు మార్పును కోరుకుంటున్నారని చెప్పారు. బీఆర్ఎస్‌పై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిపై ఆగ్రహంతో ఉన్నారన్నారు. మంత్రి పదవుల కోసం 32మంది ఎమ్మెల్యేలు పోటీ పడుతున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో మీటింగ్ పెట్టినా ముగ్గురు ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారన్నారు. ప్రభుత్వం ఏర్పడి పదహారు నెలలైనా పూర్తిస్థాయి మంత్రి వర్గ విస్తరణ చేయకపోవడం సిగ్గుచేటన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పాలకుర్తి గడ్డ నుంచే పోటీ చేస్తానని చెప్పారు. ఓటమి తర్వాతే కేసీఆర్, దయాకర్‌రావు విలువ ప్రజలకు తెలిసిందన్నారు. కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత నెలకొందన్నారు. రజతోత్సవ సభకు పాలకుర్తి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, బ్యాంక్ చైర్మన్ బొబ్బల ఆశోక్‌రెడ్డి, వైస్ చైర్మన్ కారుపోతుల వేణు, జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్ పాల్గొన్నారు.

# మళ్లీ కేసీఆరే రావాలని కోరుకుంటున్నారు

## మార్పు అంటే ఏమరుపాటుతో నమ్మిన ప్రజలు

- హామీలు నెరవేర్చలేక చతికిలపడిన కాంగ్రెస్
- రాష్ట్ర ప్రజానీకానికి ధైర్యాన్ని ఇవ్వనున్న సభ
- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి సభా స్థలి పరిశీలన




ఎల్కతుర్తి, ఏప్రిల్ 16 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ కోసం దేశంలోని కోట్లాది మంది ప్రజలు ఎదురు చూస్తున్నారని, కేసీఆర్ ఏం మాట్లాడతారనే ఉత్కంఠ ప్రజల్లో ఉందని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. బుధవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకన్న, వాసుదేవరెడ్డి, రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డిలతో కలిసి సభా స్థలిని పరిశీలించారు. ప్రధాన వేదిక వద్ద చేస్తున్న పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజానీకానికి ఈ సభ ధైర్యాన్నిస్తుందన్నారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ సబ్బండ వర్గాలను ఒక్కతాటిపైకి తీసుకొచ్చి పోరాడారని, చివరకు చావు నోట్లో తలపెట్టి నాడు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి తెలంగాణ సాధించారన్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆయన పదేండ్లలో బంగారు తెలంగాణగా మార్చారని కొనియాడారు. అన్ని కులాలు, వర్గాలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందిస్తూ సమన్యాయం పాటించారన్నారు. అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయలేక చతికిలపడిందని దుయ్యబట్టారు. మార్పు అంటే పేర్లు, విగ్రహాలు మార్చడం కాదన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడం మార్పా? అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ ఏ రాష్ట్రంలో అధికారంలో ఉన్నా అక్కడి ప్రజల్ని వంచించడం, మోసం చేయడం ఆ పార్టీకి అలవాటేనని ఆరోపించారు. కాంగ్రెస్ పాలన చూసిన తర్వాత ప్రజలంతా మళ్లీ కేసీఆరే రావాలని, సమయానికి అనేక పథకాలు అందించాలని కోరుకుంటున్నారని అన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది తరలివచ్చి సభను జయప్రదం చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులేకుండా అన్ని వసతులు కల్పిస్తున్నట్లు సత్యవతి వెల్లడించారు. కార్యక్రమంలో వరంగల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు భరత్‌కుమార్‌రెడ్డి, వెంకన్న, మండలాధ్యక్షుడు పిట్టల మహేందర్, సొసైటీ వైస్ చైర్మన్ మునిగడప శేషగిరి, మాజీ ఎంపీపీ మేకల స్వప్న, మాజీ జడ్పీటీసీ శ్రీపతి రమ, నాయకులు తంగెడ నగేశ్, కడారి రాజు, హింగె శివాజీ, రాజేశ్వర్‌రావు, దేవేందర్‌రావు, గుండేటి సతీశ్, దుగ్యాని సమ్మయ్య, కోరె రాజుకుమార్, పాటి భగవాన్, వేముల శ్రీనివాస్, కుర్ర సాంబమూర్తి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# కడియం చేసిన అభివృద్ధి శూన్యం

- దేవాదులకు రూ. 8 వేల కోట్లిచ్చింది కేసీఆరే
- దేవునూర్‌లో బినామీలతో భూములు కొనలేదా?
- శ్రీహరిపై జనగామ ఎమ్మెల్యే పల్లా ఫైర్
- రజతోత్సవ సభకు తరలిరావాలని శ్రేణులకు పిలుపు
- నీతి, నిజాయితీ ఉంటే రాజీనామా చెయ్..
- కడియంకు మాజీ ఎమ్మెల్యే రాజయ్య సవాల్
- పలు పార్టీల నుంచి 150 మంది బీఆర్ఎస్‌లో చేరిక



గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న పల్లా, రాజయ్య

వేలేరు, ఏప్రిల్ 16 : స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకర్గంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేసిన అభివృద్ధి శూన్యమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. దేవాదుల ప్రాజెక్టుకు 2014లో రూ. 8 వేల కోట్లు కేటాయించి అభివృద్ధి చేసింది మాజీ సీఎం కేసీఆరే అని పేర్కొన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా వేలేరు మండలం సోడషపల్లిలోని ఆయన స్వగృహంలో స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అధ్యక్షతన నిర్వహించిన వేలేరు, చిల్పూరు, ధర్మసాగర్ మండలాల ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశంలో పల్లా పాల్గొని మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం, నియోజకవర్గం అభివృద్ధి జరిగిందన్నారు. 2004 నుంచి ఘన్‌పూర్ నియోజకవర్గంలో కడియం శ్రీహరి ఎమ్మెల్యేగా గెలవలేదని, అభివృద్ధి ఎలా చేశాడో చెప్పాలని సూటిగా ప్రశ్నించారు. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో దేవాదుల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి వదిలేస్తే డాక్టర్ టీ రాజయ్య దేవాదుల వద్ద పిండాలు పెట్టి నిరసన తెలిపిన విషయం మర్చిపోయారా? అని ప్రశ్నించారు. 2023లో బీఆర్ఎస్ టికెట్ ఇస్తే ఇన్‌చార్జిగా పల్లా రాజేశ్వర్‌రెడ్డే ఉండాలని కోరింది నిజం కాదా? అని ప్రశ్నించారు. వేలేరు, ధర్మసాగర్, చిల్పూరు మండలాల బీఆర్ఎస్ శ్రేణుల కృషితోనే నీకు మెజారిటీ దక్కిందని, వారి పైనే అక్రమ కేసులు పెట్టడానికి మనసెలా వచ్చిందన్నారు. దేవునూర్ గుట్టల్లో నీకు సుమారు 21 ఎకరాల భూమి ఉందని నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తావా? అని ప్రశ్నించారు. కడియంకు వయసు మీదపడడంతో మతిభ్రమించి మాట్లాడుతున్నాడని పల్లా ఎద్దేవాచేశారు. నీతి, నిజాయితీ ఉంటే బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన కడియం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి నాతో పోటీ పడాలని మాజీ ఎమ్మెల్యే రాజయ్య సవాల్ విసిరారు. నిన్ను ఓడించాలని రాష్ట్రం మొత్తం ఎదురుచూస్తున్నదని రాజయ్య అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఎస్పీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన 150 మంది కార్యకర్తలకు ఎమ్మెల్యే పల్లా, రాజయ్య గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశంలో జనగామ గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గుండ్రెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మండల ఇన్‌చార్జిలు ఇట్టబోయిన భూపతిరాజు, కర్ర సోమిరెడ్డి, మనోజ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నిమ్మ కవిత, మాజీ వైస్‌ఎంపీపీ సంపత్, మాజీ జడ్పీటీసీ వెంకటేశ్వర్లు, గ్రామశాఖ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, మండల నాయకులు మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మరిజె నర్సింహారావు, బొడ్డు ప్రభుదాస్, రమేశ్‌నాయక్, గోవింద సురేశ్, ఇట్టబొయిన సంపత్, కొయ్యడ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రజతోత్సవ సభ కొత్త పాట సీడీ ఆవిష్కరణ



సీడీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా, పక్కన మాజీ ఎమ్మెల్యే రాజయ్య

జనగామ, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభపై మరో సరికొత్త పాటను స్టేషన్‌ఘన్‌పూర్ మండలం చాగల్లు గ్రామానికి చెందిన జర్నలిస్ట్ బొడ్డుల గణేశ్ రూపొందించారు. ఈ పాట సీడీని బుధవారం తన క్యాంపు కార్యాలయంలో స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యతో కలిసి జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అధినేత కేసీఆర్ చేసిన పోరాటం, అభివృద్ధి తదితర అంశాలపై వివరంగా పాటలున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పోకల జమున, నాయకులు ఇర్రి రమణారెడ్డి, బాల్దె సిద్ధిలింగం, మేకల కళింగరాజు, శ్రీధర్‌రెడ్డి, ఇమ్మడి శ్రీనివాస్‌రెడ్డి, పంతులు, పెద్ది రాజిరెడ్డి, బాల్దె విజయ, చెంచారపు పల్లవి, మామిడాల రాజు, సమద్ తదితరులు పాల్గొన్నారు.



సభా ప్రాంగణంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

# సభ సువర్ణాక్షరాలతో లిఖించబడుతుంది

- రాష్ట్ర ఏర్పాటు ముందు అవహేళనకు గురయ్యాం
- రేవంత్‌రెడ్డి మీద ప్రజలకు నమ్మకం పోయింది
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్
- ప్రభుత్వ అనుభవ రాహిత్యంతో ప్రజల ఇబ్బందులు
- ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు
- ఎల్కతుర్తిలో సభ ఏర్పాట్ల పరిశీలన

ఎల్కతుర్తి, ఏప్రిల్ 16 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని మాజీ ఎంపీ, రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లులతో కలిసి ఆయన సభా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాకముందు అవహేళనకు గురయ్యామన్నారు. ఒక వేళ తెలంగాణ ఇస్తే కరెంటు తీగల మీద బట్టలు ఆరేసుకోవాలని, నీళ్లు రాక ఎడారవుతుందని మాట్లాడారని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఎలాంటి పాలనను కేసీఆర్ అందించారో మనందరికి తెలుసన్నారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి వాటిని అమలు చేయలేడనే నిర్ణయానికి ప్రజలు వచ్చారని, సీఎంపై వారికి నమ్మకం సన్నగిల్లిందని, తాము మోసపోయామని బాధపడుతున్నారన్నారు. కేసీఆర్, రేవంత్‌రెడ్డి పాలనలో తేడాను అర్థం చేసుకున్న ప్రజలు స్వచ్ఛందంగా సభకు తరలివచ్చేందుకు సిద్ధమవుతున్నారని చెప్పారు. నాడు సమైక్య రాష్ట్రంలో, నేడు తెలంగాణలో గొప్ప సభలు నిర్వహించిన చరిత్ర బీఆర్ఎస్‌కే ఉందని, ఇప్పుడు ఎల్కతుర్తిలో జరిగే రజతోత్సవం దద్దరిల్లుతుందని వినోద్‌కుమార్ అన్నారు. ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ సభకు అడ్డంకులు కలిగించాలనుకుంటే వారే అభాసుపాలవుతారని, ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని గ్రహించే అనుమతి ఇచ్చారన్నారు. సాగు, తాగు నీళ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే అనుభవ రాహిత్యంతో ప్రజలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. ప్రజలందరి చూపు ఎల్కతుర్తి వైపే ఉందని, అందుబాటులో ఉన్న వాహనాల్లో వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్రం తెచ్చిన నేతగా, పదేండ్లు అభివృద్ధి చేసిన నాయకుడిగా కేసీఆర్ మాటలు వినేందుకు ప్రజలు ఆసక్తిగా ఉన్నారన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున సభకు తరలివచ్చి విజయంతం చేయాలని తక్కళ్లపల్లి పిలుపునిచ్చారు. వారివెంట వరంగల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు భరత్‌కుమార్‌రెడ్డి, వెంకన్న, మండలాధ్యక్షుడు పిట్టల మహేందర్ తదితరులున్నారు.

## బీఆర్ఎస్ బలమెంతో చూపాలి

- దేశాయిపేటలో టెలికాన్ఫరెన్స్ ద్వారా కార్యకర్తలకు కేటీఆర్ పిలుపు
- వరంగల్ తూర్పు నుంచి పది వేల మంది : మాజీ ఎమ్మెల్యే నరేందర్



దేశాయిపేట సమావేశంలో కేటీఆర్ సూచనలను తన ఫోన్ ద్వారా కార్యకర్తలకు వినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 16 : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు లక్షలాదిలాగా తరలివచ్చి బీఆర్ఎస్ బలమెంతో చూపించాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ టెలీకాన్ఫరెన్స్‌లో పిలుపునిచ్చారు. వరంగల్ దేశాయిపేటలో బుధవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌కు సెల్‌ఫోన్ ద్వారా కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. 'బండెనక బండి కట్టి.. పదహారు బండ్లు కట్టి' అన్న చందంగా ప్రజలు కదలిరావాలని కోరారు. బీఆర్ఎస్ సభతో కాంగ్రెస్ దిమ్మతిరిగిపోయేలా చేయాలని చెప్పారు. ఈ సభను విజయవంతం చేయడానికి కార్యకర్తలు, నాయకులు అందరూ కలిసి కలిసికట్టుగా రావాలన్నారు. అనంతరం నరేందర్ మాట్లాడుతూ దేశాయిపేటలో నుంచి ప్రజలు ఉత్సాహంగా కదలివచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తూర్పు నుంచి 110 బస్సులు, 211 టాటా మాక్స్‌లు, 200 కార్లతో పది వేల మందిని తరలిస్తున్నట్లు తెలిపారు. ప్రతి డివిజన్ల వాడవాడలా వాల్ రైటింగ్, వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తూ, పార్టీ జెండా గద్దెలకు రంగులు వేయిస్తున్నట్లు కేటీఆర్‌కు చెప్పారు. మీ శక్తినంతా కూడదీసి రావాలని, 12వ డివిజన్ నుంచి 500మంది రానున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 20 లోగా కార్యకర్తలు, నాయకుల వివరాలు, ఫోన్ నెంబర్లు పంపాలని కోరారు.

# స్థానికంలో కాంగ్రెస్‌కు వాత పెట్టాలి

- మున్సిపాలిటీలో గులాబీ జెండా ఎగురవేయాలి
- రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున హాజరవ్వాలి
- ప్రతి వార్డు నుంచి 250 మందిని తరలించాలి
- సన్నాహక సమావేశాల్లో మాజీ ఎమ్మెల్యే గండ్ర
- 200 బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహణ




వాల్ రైటింగ్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

కృష్ణకాలనీ, ఏప్రిల్ 16 : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. మున్సిపాలిటీలోనూ గులాబీ జెండా ఎగురవేయాలన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ నేపథ్యంలో బుధవారం ఆయన బీఆర్ఎస్ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్ అధ్యక్షతన జరిగిన 1, 2, 11, 12, 13, 14 వార్డుల ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశాల్లో పాల్గొన్నారు. కాసింపల్లిలోని పెద్దమ్మ తల్లి ఆలయం నుంచి చల్లూరిపల్లి వరకు 200 బైక్‌లతో పార్టీ నాయకులు నిర్వహించిన భారీ బైక్‌ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో కాసింపల్లి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, వ్యవసాయ భూములకు సైతం రోడ్లు వేయించానన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మున్సిపాలిటీకి ఒక్క రూపాయి తీసుకొచ్చిన దాఖలాలు లేవన్నారు. తాను రూ. రూ. 30 కోట్ల నిధులు తీసుకొచ్చి ఒకటే శిలాఫలకం వేస్తే.. అవే నిధులతో ప్రస్తుత ఎమ్మెల్యే శిలాఫలకాలు వేస్తున్నాడన్నారు. కాంగ్రెస్ పాలనలో దోని నిండింది లేదు, దొయ్య పారింది లేదన్నారు. బీఆర్ఎస్ అనేక ఉద్యమాలు చేసి తెలంగాణను సాధించిందని, ఉద్యమ నేత కేసీఆర్ సీఎంగా బాధ్యతలు చేపట్టి అనేక పథకాలు అమలు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రజలు కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారన్నారు. ఎల్కతుర్తిలో నిర్వహించే రజతోత్సవ బహిరంగ సభకు శ్రేణులు హాజరవ్వడంతో పాటు ప్రతి వార్డు నుంచి 250 మందిని తరలించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కాసింపల్లిలో అనారోగ్యాలతో బాధపడుతున్న పలు కుటుంబాలను పరామర్శించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణీ సిద్దు, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌కుమార్ యాదవ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బుర్ర రమేశ్, యూత్ అధ్యక్షుడు బుర్ర రాజు, టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య, మాజీ చైర్మన్ బండారి సంపూర్ణ రవి, మాజీ ఫ్లోర్ లీడర్ నూనె రాజు, మాజీ కౌన్సిలర్లు మంగళపల్లి తిరుపతి, జక్కం రవికుమార్, దార పూలమ్మ, ఆకుదారి మమత, బానోత్ రజిత, నాయకులు బీబీ చారి, మేనం రాజేందర్, పోలవేణి అశోక్, నలిగేటి సతీశ్ పాల్గొన్నారు. అలాగే ఒకటో వార్డు గడ్డిగానిపల్లిలో గండ్ర వెంకటరమణారెడ్డి రజతోత్సవ సభ వాల్ రైటింగ్ చేశారు.

# గులాబీ జెండానే తెలంగాణకు శ్రీరామరక్ష

- ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు
- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్
- 4వ డివిజన్‌లో పార్టీ కార్యాలయం ప్రారంభం



బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 16 : గులాబీ జెండానే తెలంగాణకు శ్రీరామరక్ష అని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. రజతోత్సవ మహాసభ నేపథ్యంలో 4వ డివిజన్ పరిధిలోని పెద్దమ్మగడ్డ, యాదవ్‌నగర్‌లలో బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. మొదట పెద్దమ్మగడ్డ జంక్షన్ వద్ద ఉన్న భారతరత్న, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు గజమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డప్పుచప్పుళ్ల నడుమ పటాకులు కాల్చుతూ ర్యాలీ తీశారు. అనంతరం పెద్దమ్మగడ్డ ఆటోస్టాండ్ వద్ద నూతనంగా నిర్మించిన బీఆర్ఎస్ గద్దెపై గులాబీ జెండాను దాస్యం ఎగరవేశారు. అక్కడినుంచి ర్యాలీగా వెళ్లి 4వ డివిజన్ అధ్యక్షుడు కంజర్ల మనోజ్‌కుమార్ పెద్దమ్మగడ్డలో ఏర్పాటు చేసిన పార్టీ డివిజన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దాస్యం మాట్లాడుతూ తెలంగాణ స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా నాడు టీఆర్ఎస్ నేటి బీఆర్ఎస్ పార్టీ ఏర్పడిందన్నారు. కేసీఆర్ ఒక్కడిగానే తెలంగాణ కోసం ఉద్యమాన్ని ప్రారంభించారని, 14 ఏళ్లు ఉద్యమాన్ని నడిపి స్వరాష్ట్రం అనే 60 ఏండ్ల కలను సాకారం చేశారని కొనియాడారు. సాధించిన తెలంగాణలో రెండు పర్యాయాలు సీఎంగా చేసిన కేసీఆర్ తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపారన్నారు. 16 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత అధికమైందని, ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక హామీలు, గ్యారెంటీలు అమలు చేయలేకపోతుందని విమర్శించారు. నాడు ఉద్యమ సమయంలో సైతం పెద్దమ్మగడ్డ నుంచే అనేక కార్యక్రమాలు మొదలుపెట్టామని, ఎల్కతుర్తి బహిరంగ సభ సన్నాహక సమావేశాలు సైతం పెద్దమ్మగడ్డ నుంచే ప్రారంభించినట్లు పేర్కొన్నారు. పార్టీ కార్యాలయం సామాన్యులకు అండగా ఉంటుందని తెలిపారు. ప్రజల్లో కాంగ్రెస్‌పై వ్యతిరేకత, బీఆర్ఎస్‌పై ఆదరణ పెరుగుతున్నదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొంగు అశోక్‌యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ సిరాజుద్దీన్, మాజీ డివిజన్ అధ్యక్షుడు పేర్ల మనోహర్, యూత్ అధ్యక్షుడు హనుమకొండ బద్రి, దరిగి నిరంజన్, రఘువీర్, కిరణ్, రమేష్, ప్రవీణ్, జయరాం, ప్రశాంత్, అశోక్, అరవింద్, హరీష్, అజయ్, విజయ్, శాంతమ్మ, కోమల, రాజకుమారి, ఉదయాన, పార్వతి, పులోమణి, రోజా, యాదక్క పాల్గొన్నారు.




నర్సంపేట మార్కెట్‌లో వరదకు కొట్టుకుపోయిన మక్కలు



నర్సింహులపేట : గోపతండాలో టార్పాలిన్లపై నిలిచిన నీటిని తీస్తున్న రైతులు

# గాలివాన బీభత్సం



విద్యుత్ తీగ పడి మృతి చెందిన ఉప్పలమ్మ (ఫైల్)

నమస్తే నెట్‌వర్క్, ఏప్రిల్ 16 : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మంగళవారం రాత్రి గాలి వాన బీభత్సం సృష్టించాయి. వడగండ్ల వాన పడి వరి, మక్కజొన్న, అరటి, బొప్పాయి తోటలు నేలమట్టమయ్యాయి. మామిడి కాయలు రాలిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. ఆరబోసిన మక్కజొన్నలు కొట్టుకుపోయాయి. కల్లాల్లోని మిర్చి తడిసింది. చెట్లు కూలి పోగా, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఇనుగుర్తిలో 11కేవీ వైరు తెగి నాగెల్లి ఉప్పలమ్మ(65) ఇంటి ఆవరణలో పడగా, తెల్లవారుజామున బయటకు వచ్చిన ఆమె కాలుకు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. పలు చోట్ల ఇండ్ల పైకప్పులు కొట్టుకుపోయాయి. భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు గ్రామంలో పిడుగు పాటుకు రెండు దుక్కిటెద్దులు మృతి చెందగా, నర్సింహులపేటలో కరెంట్ షాక్‌తో రెండు ఆవులు చనిపోయాయి.



చెన్నారావుపేట: రోడ్డుపై కూలిన విద్యుత్ స్తంభం



చిట్యాల : రామచంద్రాపురంలో ధ్వంసమైన అరటి తోట